పైగామ్ ఎ హిదాయత్

సంపుటి: 4 సంచిక: 4 ఏప్రిల్ 2016 వెల: 20/-

పర్యవేక్షకులు

మౌలానా ముహమ్మద్ అబ్దుల్ ఖవీ

సంపాదకులు

ముహమ్మద్ ఉమర్ ఫారూఖ్

మీ సలహాలు, సందేహాలు, మరియు
ఫిర్యాదుల కొరకు సంప్రదించగలరు

Editor, Paigham e Hidayath,
17-1-391/2/79/A,
Khaja Bagh Colony, Saidabad,
Hyderabad - 500059.
Phone: 9030557865
www.paighamehidayath.tk

బ్యాంక్ ఎకౌంట్ వివరాలు

Ac. no:035210011034204
MOHD ABDUL QAVI,
ANDHRA BANK,
MALAKPET BRANCH
IFSC Code: ANDB0000352

విషయసూచిక

ఖుర్‌ఆన్ సందేశం
సూరే ఫలఖ్ (5)

హదీస్ సందేశం
అసూయ (7)

ఆదర్శ జీవిత చరిత్ర
హుదేబియా ఒప్పందం (9)

నియమ నిబంధనలు
వజూ లోని సున్నత్‌లు (11)

వనితావని
హజ్రత్ జైనబ్ (రజి) (14)

ప్రత్యేక వ్యాసం
మేరాజున్నబీ (16)

సందేహాలు-సమాధానాలు
షబే మేరాజ్ వాస్తవికత (25)

చరితార్థులు
హాజీ షరియతుల్లాహ్ 49

దివ్య ఖుర్‌ఆన్
సూరే ఫలఖ్ 27

దివ్య హదీస్
హసద్ 29

దివ్య సీరత్
సుల్హే హుదేబియా 31

దివ్య మసాయిల్
వజూ కీ సున్నతే 33

గోష్ఠి ఎ ఖవాతీన్
హజ్రత్ జైనబ్ (రజి) 36

ఖుసూసీ ముజాక్రా
మేరాజున్నబీ 38

సువాలో జవాబ్
షబే మేరాజ్ కీ హఖీఖత్ 47

సాహిత్యపరమైన వార్తలు
నశీర్‌కు ఉగాది పురస్కారం 50

పత్రికలో రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

ఖుర్ఆన్ సందేశం

సూరే ఫలఖ్

మక్కా నగరములో అవతరింపబడిన ఈ సూరా లో 4 వచనములు ఉన్నాయి.

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

ఖుల్ ఆఊజు బిరబ్బిల్ ఫలఖ్ قُلْ اَعُوْذُ بِرَبِّ الْفَلَقِ ①

ఇలా అను: నేను ఉదయపు ప్రభువు అయిన (అల్లాహ్) శరణు వేడుకుంటున్నాను.

కొంత మంది యూదులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిపై చేతబడి చేసేందుకు ప్రయత్నించారు. ఆ చేతబడి యొక్క ప్రభావము కూడా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిపై కాస్త కనబడింది. ఆ సమయములో చేతబడి ప్రభావాన్ని దూరం చేసేందుకు దివ్య ఖుర్ఆన్ యొక్క చివరి రెండు సూరాలైన "సూరే ఫలఖ్; సూరే నాస్" అవతరించబడ్డాయి. ఈ రెండు సూరాల్లో చేతబడి ప్రభావము పోవాలంటే దేవుడ్ని ఏవిధంగా ప్రార్థించాలో ప్రవక్త గారికి తెలుపడం జరిగింది.

ఈ రెండు సూరాలను పఠించి, దమ్ చేసుకోవడం (చేతులపై ఊది వాటిని శరీరమంతా పూసుకోవడం) చేతబడి ప్రభావం తొలగించడానికి సరైన ఉపచారమని ఎన్నో హదీసుల ద్వారా మనకు తెలుస్తుంది. స్వయంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు కూడా ప్రతీ రాత్రి నిద్రపోయే ముందు ఈ సూరాలను పఠించి తమ పవిత్ర చేతులపై ఊది వాటిని తమ శరీరము పై పూసుకునేవారని కూడా హదీసుల ద్వారా తెలుస్తుంది. (ముందు తలపై ఆ తరువాత ముఖముపై ఆ తరువాత శరీరమంతటిపై).

దివ్య ఖుర్ఆన్ లోని ఈ చివరి రెండు సూరాలు ఎంతో ఘనత మరియు ప్రాముఖ్యత కలిగినవి. ఈ రెండిటిని "ముఅవ్వజతైన్" అని అంటారు. ఎందుకంటే "తఅవ్వుజ్" అనే అరబీ పదము యొక్క అర్థము రక్షణ కోరడం. ఈ రెండు సూరాలలో మనిషికి కీడు కలిగించే వాటన్నిటి నుండి రక్షణ కోరడం జరిగింది. అలగే ఈ రెండు సూరాలను పఠించడం వల్ల మనిషికి అన్ని రకాల దుష్ప్రభావాల నుండి రక్షణ కల్పించడం జరుగుతుంది. అందుకే ఈ రెండు సూరాలను "ముఅవ్వజతైన్" అని అనడం జరిగింది.

మిన్ షర్రి మాఖలఖ్

مِنْ شَرِّ مَا خَلَقَ ۝٢

ఆయన సృష్టించిన ప్రతిదాని కీడు నుండి.

వ మిన్ షర్రి గాసిఖిన్ ఇజా వకబ్

وَمِنْ شَرِّ غَاسِقٍ إِذَا وَقَبَ ۝٣

మరియు చిమ్మ చీకటి కీడునుండి, ఎప్పుడైతే అది కమ్ముకుంటుందో !

ప్రత్యేకంగా చీకటి కీడు నుండి రక్షణ కోరడం జరిగింది. ఎందుకంటే మంత్రగాళ్ళ తమ కార్యకలాపాలన్నీ ఎక్కువగా రాత్రి చీకట్లోనే నిర్వహిస్తుంటారు.

వ మిన్ షర్రిన్ నఫ్ఫాసాతి ఫిల్ ఉకద్

وَمِنْ شَرِّ النَّفَّاثَاتِ فِي الْعُقَدِ ۝٤

మరియు ముడుల మీద ఊదే వారి కీడు నుండి.

మంత్రగాళ్ళు దారాలకు ముడులు వేసి ఆ ముడులపై మంత్రాలు చదివి ఊదుతుంటారు. ఈ వచనములో అటువంటి మంత్రగాళ్ళు, వాళ్ళు చదివి ముడులపై ఊదే మంత్రాల ప్రభావము నుండి రక్షించని కోరడం జరిగింది.

వ మిన్ షర్రి హాసిదిన్ ఇజా హసద్

وَمِنْ شَرِّ حَاسِدٍ إِذَا حَسَدَ ۝٥

మరియు అసూయపరుడి కీడు నుండి, ఎప్పుడైతే అతడు అసూయపడతాడో!

మీ సలహాలు, సందేహాలు, మరియు ఫిర్యాదుల కొరకు సంప్రదించగలరు

Editor, Paigham e Hidayath,
17-1-391/2/79/A,
Khaja Bagh Colony, Saidabad,
Hyderabad - 500059.
Phone: 9030557865
www.paighamehidayath.tk

సంవత్సరపు చందా మా బ్యాంక్ అకౌంట్ లో డిపాజిట్ చేసేవారు క్రింద ఇవ్వబడిన IFSC Code ను తప్పక ఎంటర్ చేయగలరు. లేనిచో డిపాజిట్ చేసేవారి వివరాలు మాకు తెలియవు. అలాగే డిపాజిట్ చేసిన తరువాత మాకు ఫోన్ చేసి తెలుపగలరు.

IFSC Code: ANDB0000352

ముఖ్య గమనిక: ఫోన్ పై సంప్రదించువారు దయచేసి అసర్ నమాజు నుండి ఇషా నమాజు లోపు ఫోన్ చేయగలరు.

హదీస్ సందేశం

విశ్వాసులను హింసించేవారికి, అవమానించే వారికి హెచ్చరిక:

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (ర.జి) ఉల్లేఖనం ప్రకారం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు 'మింబర్' (మసీదులో అమర్చబడే ఓ చిన్న ప్రసంగవేదిక) నెక్కి సంబోధిస్తూ బిగ్గరగా అందరికి వినబడేటట్లు ఇలా సెలవిచ్చారు:

ఇస్లాంను హృదయపూర్వకంగా విశ్వసించక, నోటిమాటగా విశ్వసించే ప్రజలారా ! ముస్లిం దాసులను పీడించడాన్ని, బాధించడాన్ని, వారిని అవమానించడాన్ని, వారి రహస్య తప్పిదాల వెంట పడడాన్ని మానుకోండి. ఎందుకంటే, ఎవరైతే తన సోదర విశ్వాసి గుప్త పాపాల వెంటపడి అతడ్ని అవమానించాలనుకుంటాడో, అల్లాహ్ అటువంటివాడి పాపాల వెంట పడతాడు. అల్లాహ్ ఎవరి పాపాల వెంట పడతాడో, ఎట్టిపరిస్థితుల్లోనూ అతడ్ని అవమానపాలు చేయకుండా ఉండడు. ఒకవేళ అతను తన ఇంట్లో దూరి దాక్కున్నా సరే. ఇది అల్లాహ్ శాసనం. (తిర్మిజీ)

వ్యాఖ్యానం: ఎవరి హృదయజగత్తులోనైతే నిజమైన ఈమాన్ (విశ్వాస) సారం జీర్ణించుకుపోతుందో అలాంటి వ్యక్తి తన పరిణామం పట్ల మాత్రమే చింతన కలిగి ఉంటాడు. ఇది ఈమాన్ సారం. అది అతని మనసులో దిగిన ఫలితంగా సంభవించే దైవికమైన ప్రకృతి సిద్ధమైన ఫలితం. అతను దేవుని హక్కులు, దాసుల హక్కుల విషయంలో జాగ్రత్తగా ఉంటాడు.

ప్రత్యేకించి దైవంతో సన్నిహిత సంబంధం ఏర్పర్చుకున్న దైవదాసుల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తాడు. వారిని హింసించడం, పీడించడంగాని, వారి మనసును గాయపరచడంగాని, వారి గత చెడులను ప్రస్తావించి వారిని అవమానించడంగాని, వారి జీవితంలో దాగిఉన్న బలహీన పార్శ్వాల వెంటపడడం గాని ఎంతమాత్రం చేయడు.

కాని ఎవరి మనసులోనైతే నిజమైన ఈమాన్ సారం దిగలేదో, పైకిమాత్రమే ఇస్లామీయ ధార్మిక మాటలను వర్ణిస్తూ ఉంటరో అలాంటి వారి పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటుంది. తన స్వీయసంస్కరణను, తన లోపాలను గాలికొదిలేసి ఇతరుల లోపాలను వెతుకుతుంటాడు. ప్రత్యేకించి దైవంతో ప్రత్యేక సంబంధం నెలకొల్పుకొని, దైవారాధనలో నిమగ్నమైన దాసుల వెంట పడతారు. వారిని ప్రజల్లో చులకన చేయడానికి, వారి వరువు తీయడాననికి ప్రయత్నిస్తుంటారు. వారి తప్పుల్ని గోరంతలు కొండంతలుగా చేసి భూతద్దంలో చూపిస్తుంటారు. మొత్తానికి వారిని అవమాన పరచడానికి శతవిధాలా ప్రయత్నిస్తుంటారు.

ఈ హదీసులో దైవ ప్రవక్త మహనీయులు తీవ్రంగా హెచ్చరించింది ఇలాంటి వారినే. దైవదాసులైన విశ్వాసులను అవమానించడం, వారి స్థాయిని దిగజార్చే ప్రయత్నాలు చేయడం, వారి గోప్యమైన బలహీనతలను భూతద్దంలో చూపడం లాంటి చర్యలను మానుకోకపోతే, పరలోకంలోనే కాదు, ఇహలోకంలో కూడా వారు తీవ్ర పరాభావానికి లోనుకావలసి ఉంటుంది. వారు తప్పకుండ తీవ్ర అవమానాలను చవిచూస్తారు.

ఒకవేళ, ఈ అవమాన, పరాభావాలను తప్పించుకోవడానికి బయటికే రాకుండా వారు ఇంట్లోనే నిర్బంధజీవితం గడిపినా, దైవం అలాంటి వారిని ఇంటి నాలుగ్గోడల మధ్యనైనా సరే, అవమానించకుండా వదలడు.

అసూయ

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా ఉపదేశించారని హజ్రత్ అబూ హురైరహ్ రజియల్లాహు అన్హు గారు ఉల్లేఖించారు: "అగ్ని, కట్టెల్ని కాల్చి భస్మం చేసినట్లు, అసూయ మానవుని సత్కార్యాలను కాల్చి భస్మం చేసివేస్తుంది." (అబూదావూద్)

నేపథ్యము: మనసులో అసూయాగ్ని రగులుతున్న మనిషి పరుల సంతోషాన్ని సహించలేడు. వారిని ఏదో ఒక విధంగా దెబ్బతీయాలని, నష్టపెట్టాలని, వారి గౌరవమర్యాదలను బజారుపాలు చేయాలని కాచుకొని ఉంటాడు. ఒకవేళ అతడు వారిని ఏమీ చేయలేకపోయినా, వారిపై లేనిపోనివన్నీ కల్పించి చాడీలు చెబుతూ తన కడుపుమంట చల్లార్చుకోవడానికి ప్రయత్నిస్తాడు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇతర హదీసుల్లో సెలవిచ్చినట్లు, దీని పర్యవసానంగా ప్రళయదినం నాడు ఈ అసూయపరుడి సత్కార్యాలన్నీ, ఆ అసూయకు గురైన వ్యక్తికి ఇప్పించడం జరుగుతుంది.

అసూయ సత్కార్యాలను భస్మం చేయడం అంటే ఇదే

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి ప్రవచనాన్ని హజ్రత్ జుబైర్ రజియల్లాహు అన్హు గారు ఈ విధంగా ఉల్లేఖించారు:

"గత సమాజాల అసూయా ద్వేషాల వ్యాధి మీ వైపుకు కూడా నడిచి వస్తోంది. ఇది పూర్తిగా తుడిచివేసే, గొరిగివేసే వ్యాధి. అంటే నా ఉద్దేశ్యం, వెంట్రుకలను గొరగడం కాదు, ధర్మాన్ని పూర్తిగా తుడిచిపెట్టేస్తుంది, గొరిగిపారేస్తుంది అని." (తిర్మిజీ)

నేపథ్యము: దైవ ప్రవక్త సహచరుల విషయంలో వివేక సృష్ట అయిన అల్లాహ్ తన పవిత్ర గ్రంథంలో "వారు ఒకరికొకరు స్నేహితులు, పరస్పరం కనికరించుకునేవారు" అని ధృవపరిచాడు.

మరొకచోట, అల్లాహ్ ప్రత్యేక అనుగ్రహం వారి హృదయాలను కలిపింది. వారు పూర్వ వివాదాలను పూర్తిగా మరచిపోయి పరస్పరం సోదరులైపోయారు" అని సెలవీయబడింది. (సూరే ఆలే ఇమ్రాన్)

మరొక చోట దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ను ఉద్దేశించి ఇలా సెలవీయబడింది, "అల్లాహ్ తన ప్రత్యేక అనుగ్రహం ద్వారా నిన్ను విశ్వసించేవారి హృదయాలను కలిపాడు. ఒకవేళ నీవుగనుక ఇలా చేయడం కోసం ఇహలోకంలోని సమస్త సంపదను వెచ్చించినా వారి హృదయాల్లో ఈ ప్రేమానురాగాలను జనింపజేసి ఉండేవాడివి కావు". (సూరే అన్‌ఫాల్)

పవిత్ర ఖుర్‌ఆన్ ఈ వాక్యాల ద్వారా, దైవ అనుచరుల హృదయాలు పరస్పరం ప్రేమానురాగాలతో నిండి, ఎటువంటి అసూయ ద్వేషాలకు తావులేకుండా పవిత్రంగా ఉండేవని మనకు అర్థమవుతోంది.

కనుక ఈ హదీసు "దుబ్బ ఇలైకుమ్ దాఉల్ ఉమమి ఖబ్లకుముల్ హసదు వల్ బగ్‌జా" యొక్క ఉద్దేశ్యం ఇది కూడా కావచ్చు.

భవిష్యత్తులో ముస్లిముల్లో కూడా అసూయా ద్వేషాల ఈ మాయరోగం పెచ్చరిల్లబోతుందన్న విషయం దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారికి తెలిసిపోయింది. అందుకే వారు ఈ రాబోయే ఉపద్రవాన్ని గురించి తమ ఉమ్మత్ ను అప్రమత్తం చేస్తూ, ఈ అసూయాదేషాలనే మహమ్మారులు ఎన్నో పూర్వజాతుల ధర్మాన్ని, వారి విశ్వాసాన్ని నాశనం చేసాయి. అవి నా సమాజం వైపునకు కూడా వచ్చేస్తోందని హెచ్చరించారు. కనుక దైవదాసులారా ! ఈ ఉపద్రవం, ఈ అభిశాపం నుండి మీ హృదయాలను, ఆత్మలను సంరక్షించుకునే ప్రయత్నం చేయండి.

ఆదర్శ జీవిత చరిత్ర

హుదైబియా ఒప్పందం

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు హిజ్రత్ చేసిన ఆరేళ్ళ వరకు యుద్ధాలు జరుపుతూ ఉన్నారు. హిజ్రత్ చేసిన ఆరవ సంవత్సరం ఆయనకు కాబతుల్లాహ్ యొక్క ప్రదక్షన చేస్తున్నట్లు కల వచ్చింది.

ఇది విన్న అనుచరుల మనసులో కూడా ఉమ్రా చేయాలన్న ఆశ పుట్టింది. వారు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారిని ఉమ్రాహ్‌కు వెళ్ళే దిశగా ఆలోచించాలని అర్ధించారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు దానికి సమ్మతించి, దగ్గర దగ్గరగా వదిహేను వందల మంది అనుచరులను వెంటబెట్టుకుని ఉమ్రాహ్ కోసం బయలుదేరారు.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు వస్తున్న విషయం తెలిసిన మక్కా వారు చుట్టూ ఉన్న తెగల వారందరితో కలిసి ఆయనను అడ్డుకునేందుకు సన్నాహాలు చేశారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు వచ్చే ముందు వారందరూ కలిసి మక్కా ముందు తమ సైనికులను సిద్ధంగా ఉంచారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారికి ఈ విషయం తెలిసి "హుదేబియా" వెళ్ళే దారి వదిలి మరో చోట తమ స్థావరాన్ని ఏర్పాటు చేసి, "నేను ఈ రోజు మక్కా వారు ఎటువంటి ఒప్పందానికి పిలిచినా ఒప్పుకుంటాను" అని అన్నారు.

మక్కా వారితో ఒప్పందం చేసుకోవటానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు హజ్రత్ ఉస్మాన్ ర.జి ని మధ్యవర్తిగా పంపించారు.

హజ్రత్ ఉస్మాన్ ర.జి గారిని మక్కా వారు చాలా మర్యాదలు చేసి కాబతుల్లాహ్ యొక్క ప్రదక్షణలు చేసుకొమ్మని అనుమతించారు.

దానికి జవాబుగా హజ్రత్ ఉస్మాన్ ర.జి గారు "అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి కంటే ముందు ఉస్మాన్ కాబతుల్లాహ్ యొక్క ప్రదక్షణలు చేయలేడు" అని అన్నారు. అదే సమయంలో హజ్రత్ ఉస్మాన్ ర.జి గారిని మక్కా వారు చంపేసారని వదంతులు వ్యాపించాయి.

అన్ని తెగలలో, అన్ని దేశాలలో, రాయబారిని చంపడం ఒక పెద్ద నేరంగా పరిగణించేవారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు, హజ్రత్ ఉస్మాన్ ర.జి గారి హత్యకు ప్రతీకారం తీర్చుకోవటానికి ఎవరైతే సిద్ధంగా ఉన్నారో వారు వచ్చి తన చేతుల మీద ప్రమాణం చేయవలసిందిగా చెప్పారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి అనుచరులందరూ ప్రమాణం చేయడానికి ఒక చోట చేరారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు హజ్రత్ ఉస్మాన్ ర.జి గారి తరపున తన రెండో చేతిని తన చేతి మీద పెట్టి "ఇది ఉస్మాన్ చేయ్యి" అని అన్నారు. ఆ ప్రమాణం చేసే సమయంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు "హుదేబియా" లో ఓ చెట్టు క్రింద ఉన్నారు. అల్లాహ్ తఆలా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి అనుచరుల మనోభావాలను మరియు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి అనుకరుణకు మెచ్చి దివ్య ఖుర్ఆన్ లో ఈ సంఘటనను ప్రస్తావిస్తూ వారి పట్ల తమ "రిజా" అనగా ప్రీతిని వ్యక్తం చేశారు. అందుకే ఈ ప్రమాణాన్ని "బైఅతే రిజ్వాన్" అంటారు. ఆ తరువాత హజ్రత్ ఉస్మాన్ ర.జి గారి హత్య జరగలేదని, ఒట్టి వందంతులేనని తెలిసింది.

హుదేబియా ఒప్పందం:

మక్కా వారి ప్రతినిధులు ఒక్కొక్కరి చప్పున ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి దగ్గరకు వచ్చారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ అందరికీ ఒకే విషయం చెప్పారు. "మేము ఉమ్రాహ్ చేయటానికి వచ్చాము. మేము ఎటువంటి సంఘర్షణ లేకుండా ఉమ్రాహ్ చేసి వెళ్ళిపోతాము." అని చెప్పేవారు. కానీ వాళ్ళకి ఆ విషయం అర్థమయ్యేది కాదు. వారు ఒక్క మాట మీదే పట్టుబట్టి కూర్చున్నారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు వెనక్కి వెళ్ళిపోవలసిందే. ఎటువంటి పరిస్థితుల్లో మక్కాలో అడుగుపెట్టనీయము."

చివరికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు వారు పెట్టిన షరతులకు ఒప్పుకొని ఒక ఒప్పందాన్ని చేసుకున్నారు. దానిలో ఖరారైన విషయాలలో ఒకటి ఏమనగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు, వారి అనుచరులు ఈ సంవత్సరం వెనక్కి వెళ్ళిపోయి వచ్చే సంవత్సరం ఉమ్రాహ్ కోసం రావాలి". ఇంకో షరతు ఏమిటంటే అవిశ్వాసులలో నుంచి ఎవరైనా ఇస్లాం స్వీకరించి మదీనాకు వస్తే అతడ్ని మక్కా వారికి అప్పగించేయాలి. ఒక ముస్లిం గనక ఇస్లాం ధర్మాన్ని వదిలి మదీనా నుండి మక్కాకు తిరిగి వచ్చేస్తే అతడ్ని మక్కా వారు ఎట్టి పరిస్థితులో ముస్లిమలకు అప్పగించరు. ఇలా ఆ ఒప్పందములో విధించబడ్డ షరతులన్నీ మక్కా వారికి అనుకూలంగా, విశ్వాసులకు ప్రతికూలంగా ఉన్నాయి. విశ్వాసులకు ఈ షరతులలో ఏ ఒక్కటీ మంజూరు కాకపోయునా దైవాదేశం ప్రకారం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు వాటిని అంగీకరించారు.

ఎలాగైతేనేమి ఒప్పందము కుదిరి ఇరువైపుల వారు దాని మీద సంతకాలు చేశారు. అసలు దీని వల్ల ఏ అద్భుత విజయం సాధించబోతున్నారో, ఆ విజయం అన్ని యుద్దాల కంటే మెరుగైన ఫలితాన్ని ఇచ్చేదవుతుందో ఎవరూ ఊహించలేదు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారికి దాని మీద వంద శాతం నమ్మకం ఉంది. ఎందుకంటే అల్లాహ్ ఖుర్ఆన్ లోని సూరహ్ ఫతహ్ యొక్క మొదటి పంక్తులు అవతరింపజేసినప్పుడు ఒక సహాబీ (అనుచరుడు) "ఇదేనా ఆ విజయం?" అని అడిగితే దానికి జవాబుగా ఆయన మీద ప్రమాణం చేసి చెబుతున్నాను, ఎవరిచేతుల్లో నా పాణాలు ఉన్నాయో, ఇదే ఆ విజయం" అని జవాబిచ్చారు.

తదుపరి ప్రయాణం:

ఒప్పంద పత్రాల మీద సంతకాలు అయిపోయిన తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు తమ అనుచరులను ఎహ్రామ్ తీసేందుకు గుండు చేయించుకుని, బలి ఇవ్వమని ఆజ్ఞాపించారు. ప్రవక్త గారికి ఈ ఒప్పందం యొక్క పర్యవసానమైన అద్భుత విజయం గురించి అల్లాహ్ వహీ ద్వారా ముందే తెలిపారు. సహాబాకు ఆ పర్యావసానం గురించి తెలియక చాలా బాధతో, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి ఆజ్ఞను పాటించడంలో కొంచం వ్యవధి తీసుకున్నారు. ఒక సైగ చేస్తే తమ ప్రాణాలను సైతం అర్పించే అనుచరులు, ఆజ్ఞ పాటించడానికి సంశయిస్తుండటం చూసి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు చాలా బాధపడి తమ సతీమణి అయిన హజ్రత్ ఉమ్మె సల్మా రజియల్లాహు అన్హా కు అంతా చెప్పారు.

అప్పుడావిడ ఒక సలహా ఇచ్చారు. "ఓ దైవ ప్రవక్తా ! ముందు మీరు బలి ఇచ్చి, గుండు చేయించుకోండి. మిమ్మల్ని చూసి వారు తప్పకుండా పాటిస్తారు. మీరు మీ నిర్ణయాన్ని మార్చుకొని యుద్ధానికి పిలుస్తారేమోనని వారు ఎదురు చూస్తున్నారు. మీరే గనక మీ అహ్రామ్ తీసేస్తే ఇక తిరుగు ప్రయాణమే మీ చివరి నిర్ణయంగా వారు తెలుసుకుని వారు కూడా తమ తమ అహ్రామ్‌లు తీసివేస్తారు, మీరు చెప్పిన విధంగానే నడుచుకుంటారు" అని చెప్పారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు గుడారం నుండి బయటకు వచ్చి బలి ఇచ్చి, క్షవరం చేయించుకున్నారు. ఇది చూసిన వారి అనుచరులు వెంటనే తాము ధరించి ఉన్న తమ అహ్రామ్ దుస్తులను విప్పి, ఉమ్రా తరువాత బలివ్వడానికి తెచ్చిన జంతువులను బలిచ్చి తిరుగుప్రయాణానికి సంసిద్ధులయ్యారు.

నియమ నిబంధనలు

వజూ విధానము

వజూలో 18 సున్నత్‌లు ఉన్నాయి

1. రెండు చేతులు మణికట్టు వరకు కడుగాలి:

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు వజూ ఆరంభములో తమ రెండు చేతులు మణికట్టు వరకు కడిగేవారని బుఖారీ హదీస్ నంబర్ 159 ద్వారా తెలుస్తోంది.

2. ఆరంభములోనే బిస్మిల్లాహ్ పఠించడం:

బిస్మిల్లాహ్ చదవని వారి వజూ కాదని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తెలిపినట్లు తిర్మిజీ అబూదవూద్ లోని ఉల్లేఖనాలా ద్వారా తెలుస్తోంది.

ఈ హదీసును చూసి బిస్మిల్లాహ్ పఠించనిదే వజూ కాదని అర్థం చేసుకోకూడదు. వజూ పరిపూర్ణము కదని దాని అర్థం. అంటే వజూ పై లభించాల్సిన పూర్తి పుణ్యము అతడికి లభించదు. దారకుత్నీ హదీస్ 230 మరియు బైహఖీ హదీస్ 200 లో ఉన్న హజ్రత్ ఇబ్నె ఉమర్ మరియు హజ్రత్ అబూ హురైరహ్ రజియల్లాహు అన్‌హుమాల ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఈ విధంగా సెలవిచ్చారు: బిస్మిల్లాహ్ చదివి వజూ చేస్తే దాని ప్రభావము శరీమంతటా ఉంటుంది, అదే బిస్మిల్లాహ్ పఠించకుండా వజూ చేస్తే దాని ప్రభావము వజూలో కడిగే అవయవాల వరకే పరిమతమవుతుంది. ఈ హదీసు ద్వారా స్పష్టంగా అర్థమయ్యేది ఏమిటంటే బిస్మిల్లాహ్ చదివినా చదవకపోయినా వజూ మాత్రం అయిపోతుంది. కాని బిస్మిల్లాహ్ చదవకపోతే ఆ వజూ పరిపూర్ణమైనదిగా పరిగణించబడదు. అదే వజూతో నమాజు చదివితే ఆ నమాజులోనూ పరిపూర్ణత రాదు. దాని వల్ల పుణ్యము తగ్గిపోతుంది. ఎలాగైతే మిస్వాక్ చేయకుండా ఆచరించబడిన నమాజుకు మిస్వాక్ చేసి ఆచరించబడిన నమాజు కంటే 70 రెట్లు తక్కువ పుణ్యము లభిస్తోందని హదీసులో పేర్కొనబడిందో అలాగే ఇక్కడ కూడా పుణ్యము తగ్గిపోతుందని అర్థం చేసుకోవాలి.

3. మిస్వాక్ చేయడం, ఒకవేళ మిస్వాక్ లేకపోతే వేలుతో పళ్ళు తోముకోవడం:

వజూ చేసేటప్పుడు మిస్వాక్ తప్పక చేయమని ఎంతో తాకీదు చేయడం జరిగింది. చివరికి "నా ఉమ్మత్ పై భారమవుతుందన్న భయం లేకపోతే నేను ప్రతీ నమాజుకు ముందు, ప్రతీ వజూకు ముందు మిస్వాక్ తప్పకుండా చేయాలని ఆదేశించేవాడినని" దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తెలిపినట్లు మనకు ముస్లిం హదీస్ 252 ద్వారా అర్థమవుతుంది. అనగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు మిస్వాక్ శుభాలు, దాని యొక్క ప్రాముఖ్యత దృష్ట్య ప్రతిఒక్కరూ తప్పకుండా మిస్వాక్ చేయాలని ఆదేశించాలనుకున్నారు. కాని ఇలా మిస్వాక్‌ను తప్పనిసరి విధిగావిస్తే ప్రజలు దానిపై అమలు చేయలేరేమో నన్న భయం వల్ల ప్రవక్త గారు అలా చేయలేదు. మిస్వాక్ గురించి ప్రవక్త గారు ఇంత తాకీదు చేస్తున్నారంటే అందులో ఎన్ని శుభాలు, ప్రయోజనాలు ఉండుంటాయో మనం అర్థం చేసుకోవచ్చు. లేకపోతే ఓ చిన్న పనికి ఇంతగా తాకీదు చేసుండరు. సుననే నసాయీ హదీసు నంబర్ 5 ను మనం చూసినట్లయితే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి

వసల్లమ్ వారు మిస్వాక్ యొక్క రెండు ప్రయోజనాలను తెలిపారు. అందులో ఒకటి మన నోరు శుభ్రమవుతుంది, రెండవది అల్లాహ్ ప్రీతి ప్రాప్తిస్తుంది. (ఈ హదీసు బుఖారీ లోనూ సంక్షిప్తంగా వచ్చింది). కాబట్టి ప్రతీ ముస్లిము కూడా మిస్వాక్ ను తప్పక పాటిస్తుండాలి.

ఒకవేళ సమయానికి మిస్వాక్ గనక లేకపోతే చేతి వేలితోనైనా పళ్ళు శుభ్రం చేసుకోవాలి. ఎందుకంటే బైహఖీ హదీసు 176 నుండి 180 వరకు మనం చూసినట్లయితే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు మిస్వాక్ కు బదులుగా తమ వేలినైనా ఉపయోగించవచ్చని తెలిపినట్లు తెలుస్తుంది. కాని ఇది మిస్వాక్ లేనప్పుడు మాత్రమే.

4. మూడు సార్లు పుక్కిలించడం:

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు వజూ లో మూడు సార్లు నీళ్ళు తీసుకుని పుక్కిలించేవారని హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె జైద్ రజియల్లాహు అన్హు గారు ఉలేఖించిన బుఖారీ హదీస్ 192 ద్వారా మనకు తెలుస్తుంది. కాబట్టి వజూ ఆరంభములో మిస్వాక్ చేసిన తరువాత మూడు సారు విడి విడిగా నీళ్ళు తీసుకుని పుక్కిలించడం సున్నత్.

5. మూడు సార్లు ముక్కులోకి నీళ్ళు తీసుకుని శుభ్రముచేయాలి:

పైన పేర్కొన్న అబ్దుల్లాహ్ ఇబ్నె జుబేర్ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు మూడు సార్లు ముక్కులోకి నీళ్ళు తీసుకొని ముక్కును శుభ్రము చేసేవారని తెలుస్తుంది. కాబట్టి వజూలో ఇలా మూడు సార్లు ముక్కు కడగడం సున్నత్.

6. ఉపవాసము లేనివారు నోటిని, ముక్కుని బాగా శుభ్రం చేయాలి:

ఉపవాసము లేని వారు వజూ చేసేటప్పుడు నోటిని, ముక్కుని నీటితో బాగా కడగాలని ఆదేశించినట్లు అబూదావూద్ హదీస్ 2366 ద్వారా మనకు తెలుస్తుంది. అనగా ఉపవాసము లేనివారు నీటిని ఎక్కువ మోతాదులో తీసుకొని నోటిని, ముక్కుని లోపలి వరకు (సాధ్యమైనంత వరకు) బాగా శుభ్రము చేయాలి. ఉపవాసము ఉన్న వారు అలా చేయకూడదు. అలా చేస్తే నీళ్ళు గొంతులోగి దిగి ఉపవాశము భంగమయ్యే అవకాశము ఉంది. వారు తక్కువ మోతాదులో నీళ్ళు తీసుకుని పైపైన శుభ్రం చేసుకోవాలి.

7. అరచేతిలో నీళ్ళు తీసుకుని గెడ్డము యొక్క ఖిలాల్ చేయడం:

ఖిలాల్ అంటే ఒక దాన్ని మరొక దాంట్లోకి దూర్చడం. గడ్డము యొక్క ఖిలాల్ చేయడం అంటే పెద్ద గడ్డము కలవారు వజూ చేసేటప్పుడు వారి గడ్డము లోపలి భాగము తడవదు. అలాంటప్పుడు అరచేతిలో నీళ్ళు తీసుకుని గడ్డము క్రింది భాగము నుండి తడిపి తమ చేతి వేళ్ళతో దువ్వెన చేసినట్లు తమ గడ్డములో చేయాలి. దీని వల్ల గడ్డము లోపలి భాగము కూడా తడుస్తుంది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇదే విధంగా ఖిలాల్ చేసేవారని అబూదావూద్ హదీస్ 145; తిర్మిజీ హదీస్ 31 ద్వారా తెలుస్తోంది. (గుర్తుంచుకోండి గడ్డము మొత్తం తడవనక్కర లేదు. పైభాగము తడిస్తే చాలు వజూ అయిపోతుంది. లోపలి భాగమంతా తడవనక్కరలేదు. అందుకే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు కేవలం ఒకసారి నీటితో ఇలా ఖిలాల్ చేసేవారు. ఒకవేళ లోపలి భాగమంతా తడవాలంటే అది చాలా కష్టతరమై పోతుంది.

8. వేళ్ళ మధ్య ఖిలాల్ చేయడం:

గడ్డము యొక్క ఖిలాల్ చేసినట్లే కాళ్ళు మరియు చేతి వేళ్ళ మధ్యన కూడా ఖిలాల్ చేయడం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి పవిత్ర సున్నత్. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు వజూ చేసేటప్పుడు వేళ్ళ మధ్య ఖిలాల్ చేయమని ఆదేశించనట్లు తిర్మిజీ హదీస్ 38 ద్వారా తెలుస్తుంది.

చేతి వేళ్ళ మధ్య ఖిలాల్ చేసే పద్ధతి ఏమిటంటే చేతులు కడిగేటప్పుడు ఒక చేతి వేళ్ళను మరో చేతి వేళ్ళ మధ్య పెట్టి కాస్త రుద్దుకోవాలి. కొన్ని సార్లు వేళ్ళ మధ్య సందులో నీరు చేరదు, దాని వల్ల వజూ కాదు. ఇలా వేళ్ళ మధ్య ఖిలాల్ చేయడం వల్ల అక్కడ కూడా నీరు చేరి వజూ పరిపూర్ణమవుతుంది. కాలి వేళ్ళ మధన ఖిలాల్ చేసే విధానము తిర్మిజీ 40, అబూదావూద్ 148, ఇబ్నె మాజహ్ 446 లో వివరించడం జరిగింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తమ చేతి చిటికెన వేలుతో కాలి వేళ్ళ మధ్య ఖిలాల్ చేసే వారు. కాబట్టి ఈ విధంగా మనం వేళ్ళ మధ్య ఖిలాల్ చేస్తే మన వజూ సంపూర్ణమవుతుంది.

9. ప్రతీ అవయవాన్ని మూడుసార్లే కడిగేడిం:

సాధారణంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు వజూలో తమ అవయవాలన్నిటినీ మూడు మూడు సార్లు కడిగేవారు. (తల, మెడ, చెవుల మసాహ్ మాత్రం ఒక్కసారే చేశేవారు) కానీ కొన్ని సందర్భాలలో (బహుశా ప్రయాణంలో లేదా యుద్ధ మైదానములో) కేవలం ఒక్కొక్క సారి, లేదా రెండు రెండు సార్లు కడిగినట్లు కూడా బుఖారీ హదీస్ 157, 158 ద్వారా మనకు తెలుస్తోంది. కాబట్టి వజూలో ఈ అవయవాలను ఒక్కొక్క సారి కడిగినా వజూ అయిపోతుందని తెలుస్తుంది. కాని మూడు మూడు సార్లు కడగడం శ్రేష్ఠమైనదని, అభిలషనీయమైనదని ఇబ్నె మాజహ్ హదీస్ 419, 420 ద్వారా తెలుస్తుంది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు అవయవాలను ఒక్కొక్క సారి కడిగి చూపించి కనీసం ఇంత చేసినా వజూ అయిపోతుందని అన్నారు. ఆ తరువాత అవయవాలను రెండు రెండు సార్లు కడిగి చూపించి ఇలా వజూ చేస్తే పుణ్యం రెండింతలు లభిస్తుందని అన్నారు. ఆ తరువాత అవయవాలను మూడు మూడు సార్లు కడిగి చూపించి ఇది నా వజూ మరియు నా కంటే ముందు వచ్చిన ప్రవక్తలందరి వజూ విధానము అని అన్నారు.

గుర్తుంచుకోండి వజూలో అవయవాలను మూడుసార్లు కంటే ఎక్కువ కడగడం సరికాదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా చేయకూడదని తెలిపినట్లు సుననే నసాయీ హదీస్ 140 ద్వారా తెలుస్తుంది.

10. ఒక్కసారి మొత్తము తలపై మసాహ్ చేయుడిం:

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తలపై మసాహ్ మాత్రం ఒక్కసారే చేసేవారని అబూదావూద్ హదీస్ 108 మరియు తిర్మిజీ హదీస్ 34 ద్వారా తెలుస్తోంది.

11. తలపై మసాహ్ చేసిన తరువాత మిగిలిన తడితోనే చెవులపై మసాహ్ చేసుకోవడిం:

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తలపై మసాహ్ చేసేటప్పుడు చేతులను విడిగా తడుపుకునేవారని అబూదావూద్ హదీస్ 124లో చెప్పబడింది. అనగా చేతులు కడుకున్న తరువాత తలపై మసాహ్ చేయడం కోసం ప్రవక్త వారు మళ్ళీ తమ అరచేతులను విడిగా తడుపుకునేవారు. మరి చెవులపై మసాహ్ చేసేటప్పుడు కూడా అరచేతులను విడిగా తడుపుకోవాలా? లేదా? సహీ ఇబ్నె హిబ్బాన్ హదీస్ 1086 ద్వారా అర్థమయ్యేది ఏమిటంటే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు చెవులపై మసాహ్ చేసేందుకు మళ్ళీ తమ అరచేతులను తడుపుకునేవారు కాదు. తలపై మసాహ్ చేసిన తరువాత చేతుపై మిగిలిఉన్న తడితోనే చెవులపై మసాహ్ చేసేవారు.

12. అవయవాలను రుద్దడిం:

వజూలో అవయవాలను పూర్తిగా తడపాలి. గోరంత భాగమైనా పొడిగా ఉంటే వజూ కాదని ముస్లిం హదీస్ 243 ద్వారా తెలుస్తుంది. అందుకే వజూ చేసేటప్పుడు అవయవాలను చేతులతో బాగా రుద్దుకోవాలి. కేవలం నీళ్ళుపోసి అయిపోయిందని వదిలేయకూడదు.

(మిగతాది పేజీ 15లో)

వనితావని హాజిత్ జైనబ్ రజియల్లాహు అన్హా

హజ్రత్ అబుల్ ఆస్ సత్య సంధులు, నీతిపరులు. ప్రజలు వారి దగ్గర తమ అప్పగింతలు (అమానతులు)) పెడితే ఎంతో నీతి నిజాయితీలతో వాటిని భద్రపరిచేవారు. అడిగిన వెంటనే వాటిని తిరిగి అప్పగించేవారు. మక్కాలో ఎంత పలుకుబడి గలవారంటే ప్రజలు తమ వ్యాపార సామాగ్రిని వారికి ఎగుమతి చేసేందుకు పంపేవారు.

హిజ్రీ శకం 6వ సంవత్సరంలో అబుల్ ఆస్ రజియల్లాహు అన్హు గారు ఓ వ్యాపార పటాలంతో సిరియా వెళుతుండగా "అయ్స్" అనే ప్రాంతంలో ముస్లిం వీర యోధులు ఖురైష్ బిడారు పై దాడి చేశారు. మొత్తం ధన సామాగ్రిని ముట్టడించారు. అబుల్ ఆస్ మదీనాకు పారిపోయారు. ఇతర అవిశ్వాసులను ముస్లింలు బంధించారు. అబుల్ ఆస్ మదీనా చేరి జైనబ్ రజియల్లాహు అన్హా గారి ఆశ్రయం పొందారు. దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారితో మాట్లాడి తన సామాగ్రిని తనకు వాపసు ఇప్పించమని వేడుకున్నారు. అబుల్ ఆస్ రజియల్లాహు అన్హు గారు మక్కాలో హజ్రత్ జైనబ్ రజియల్లాహు అన్హా గారితో వ్యవహరించిన తీరును దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు చాలా మెచ్చుకునేవారు. కనుక తమ సహచరులతో "అబుల్ ఆస్ సామాగ్రిని మీరు వాపసు చేస్తే నేను కృతజ్ఞుడవుతాను" అని అన్నారు.

సహచరులు ఎల్లప్పుడూ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి ప్రసన్నతనే కాంక్షించేవారు. కనుక వెంటనే మొత్తం ధన సామాగ్రిని అబుల్ ఆస్ కు తిరిగి ఇచ్చేశారు. అబుల్ ఆస్ మొత్తం సామాగ్రి తీసుకొని మక్కా వెళ్లారు. ప్రజల అమానతులను అప్పగించారు. తరువాత మక్కావాసులనుద్దేశించి ఇలా అన్నారు: "ఖురైష్ ప్రజలారా ! మీలో ఇంకా ఎవరి అప్పగింత అయినా నా వద్ద ఉండిపోయిందా?"

మక్కావాసులందరూ ముక్త కంఠంతో ఇలా అన్నారు: "లేదు, దైవం మీకు మంచి ప్రతిఫలం ఇవ్వుగాక. మీరు సత్యసంధులు నిజయితీపరులు".

వారి జవాబు విన్న తరువాత హజ్రత్ అబుల్ ఆస్ రజియల్లాహు అన్హు గారు ఇలా అన్నారు: అయితే వినండి, నేను ముస్లింనయ్యాను. దైవ సాక్షి ! ఇస్లాం స్వీకరించేందుకు నేను వెనుకాడింది కేవలం నన్ను అవనీతిపరుడి నని అంటారేమోననే. ఆ తరువాత కలిమా పఠించారు. అక్కడి నుండి హిజ్రత్ చేసి మదీనా వెళ్ళిపోయారు. హజ్రత్ జైనబ్, అబుల్ ఆస్‌లు షిర్క్ కారణంగా విడిపోయారు. వారి మధ్య నికాహ్ సంబంధం తెగిపోయింది. కనుక అబుల్ ఆస్ ఇస్లాం స్వీకరించి మదీనా చేరుకున్నాక దైవప్రవక్త మళ్ళీ ఇరువురి నికాహ్ జరిపించారు.

ఆ తరువాత హజ్రత్ జైనబ్ రజియల్లాహు అన్హా ఎంతో కాలం జీవించలేదు. త్వరలోనే ఇహలోకాన్ని వీడారు. మక్కా నుండి వస్తున్నప్పుడు 'జీతువా ప్రాంతంలో' గర్భస్రావం కావడం వల్ల మరణించారు.

ఉమ్మె ఐమన్, హజ్రత్ సౌదా, ఉమ్మె సల్మా రజియల్లాహు అన్హున్న దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి ఆజ్ఞ మేరకు హజ్రత్ జైనబ్ రజియల్లాహు అన్హా గారి మృతదేహాన్ని గుసుల్ చేయించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్

వారు ఉమ్మె అతియ్యా తో గుసుల్ చేయించిన తరువాత కబురుపెట్టమని అన్నారు. గుసుల్ అనంతరం వారికి కబురుపెట్టగా వారు తమ వస్త్రాన్ని తీసిచ్చి దీన్ని ఆమె కఫన్ మధ్యలో పెట్టమని అన్నారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారే స్వయంగా జనాజా నమాజు చేయించారు. అబుల్ ఆస్ రజియల్లాహు అన్హు గారు సమాధిలో దించారు. ఓ ఉల్లేఖనంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు కూడా సమాధిలోకి దిగారని ఉంది.

జైనబ్ రజియల్లాహు అన్హా గారు చనిపోయిన రోజు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు చాలా దుఖి:ంచారు. కళ్ళ నుండి అశ్రుధారలు కారసాగాయి.

జైనబ్ నా కుమార్తెలందరిలో చాలా గొప్ప కుమార్తె. నా ప్రేమ కోసం కష్టాలనుభవించింది అనేవారు.

హజ్రత్ జైనబ్ రజియల్లాహు అన్హా గారికి అలీ బిన్ అబుల్ ఆస్ మరియు ఉమామా ఇద్దరు సంతానం. ఓ ఉల్లేఖనం ప్రకారం అలీ యర్మూక్ యుద్ధంలో అమరగతులయ్యారు.

కొన్ని రోజుల తరువాత హజ్రత్ అబుల్ ఆస్ రజియల్లాహు అన్హు గారు కూడా మరణించారు. మరణించకు ముందు ఆయన తమ కుమార్తె ఉమామా రజియల్లాహు అన్హా ను తన మావ గారి కుమారుడైన హజ్రత్ జుబైర్ రజియల్లాహు అన్హూ గారికి అప్పగించారు. వారు హజ్రత్ ఫాతీమా రజియల్లాహు అన్హా గారి మరణాంతరం హజ్రత్ ఉమామా ను హజ్రత్ అలీ రజియల్లాహు అన్హు గారికిచ్చి వివాహము జరిపించారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి ప్రథమ కుమార్తె అయిన హజ్రత్ జైనబ్ రజియల్లాహు అన్హా గారి జీవితం నుండి నేర్చుకోవలసినది ఎంతో ఉంది. దేవునిపై వారి బలమైన విశ్వాసం, వారి సహనం తండ్రి పట్ల ప్రేమ వీటిలోని రవ్వంత కూడా మనలో వస్తే ఇన్షాల్లాహ్ మన జన్మ సార్థకమవుతుంది.

(13వ పేజీ తరువాయి భాగం) లేదంటే ఎక్కడైనా కాస్త పొడి మిగిపోయేందుకు ఆస్కారము ఉంది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు కూడా వజూలో తమ అవయవాలను బాగా రుద్ది కడిగేవారని ఇబ్నె మాజహ్ హదీస్ 432 లో ప్రేర్కొనబడింది.

14. సంకల్పించుకోవడం:

సంకల్పము ప్రతి పనికి ఆధారము. అల్లాహ్ ప్రీతి పొందాలనే సంకల్పముతో చేసిన ఆచరణలకే పుణ్యము, దైవ ప్రీతి లభిస్తుంది. ధార్మిక, ప్రాపంచిక కార్యాలన్నిటికి ఇదే సూత్రము వర్తిస్తుంది. కాబట్టి వజూ కు కూడా పుణ్యము లభించాలంటే సంకల్పము తప్పనిసరి. అశ్రద్ధగా లేదా చల్లదనం కోసం లేదా మరింకేదో ప్రయోజనం కోసం వజూ చేస్తే వజూ మాత్రం అయిపోతుంది. కాని పుణ్యఫలం లభించదు. కాబట్టి వజూ చేసేటప్పుడు తప్పక సంకల్పించుకోవాలి.

గుర్తుంచుకోండి, సంకల్పమనేది మనసుతో చేస్తారు. నోటితో కాదు. కొందరు తాము సంకల్పించుకున్నట్లు నోటితో పలుకుతుంటారు. అలా చేయనఖ్ఖరలేదు.

15. క్రమ పద్ధతిలో వజూ చేయడం:

వజూలో ముందు ఏ అవయవాన్ని కడిగినా పర్వాలేదు. ముఖము, చేతులు, కాళ్ళు కడిగి తలపై మసాహ్ చేస్తే చాలు వజూ అయిపోతుందని సునన్ దారకుత్నీ 1/153 లోని హజ్రత్ అలీ రజియల్లాహు అన్హు గారి అసర్ ద్వారా తెలుస్తుంది. కాని ఖుర్ఆన్ మరియు హదీసులో ఏదైతే క్రమ వర్ధతి చూపించబడిందో దాన్ని అనుసరించడం శ్రేష్ఠమైనది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఎప్పుడూ అదే పద్ధతిని అవలంభించేవారు.

16. కుడివైపు నుండి వజూను ఆరంభించడం:

ఇది కూడా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి సున్నత్ అని, ప్రవక్త గారు ఒక్క వజూలోనే కాదు ప్రతీ పనిని కుడి వైపు నుండి ఆరంభించడానికి మొగ్గుచూపేవారని హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా గారు తెలిపారు. (బుఖారీ: 5926)

ప్రత్యేక వ్యాసం

మేరాజున్నబీ (సల్లల్లాహు అలైహి వసల్లమ్)

సహీ ముస్లింలో హజ్రత్ అనస్ ర.జి గారి కథనం ప్రకారం దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఈ విధంగా తెలియజేశారు: "నా వద్దకు ఓ బురాఖ్ ను తీసుకొచ్చారు, అది తెల్ల రంగు గల నాలుగు కాళ్ళ జెంతువు. అది గాడిద కంటే పొడవైనది, ఖచ్చర్ కంటే చిన్నది. అది తన కంటి చూపు ఎంత దూరం పోతుందో అంత దూరం తన ఒకొక్క అడుగు వేసేది. దానిపై నన్ను బైతుల్ మఖ్దిస్ కు తీసుకొచ్చారు. అక్కడ చేరుకొని దైవ ప్రవక్తలు తమ జంతువులను ఎక్కడైతే కట్టి ఉంచేవారో నేను కూడా బురాఖ్‌ను అక్కడే కట్టి మసీదులోకి ప్రవేశించాను. అక్కడ రెండు రకాతులు నమాజు చేసి బయటకు రాగా హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు ఓ పాత్రలో పాలు మరో పాత్రలో మధ్యము తీసుకొని వచ్చారు. నేను పాలును ఎంచుకున్నాను. అప్పుడు ఆయన "అనసబ్‌తల్ ఫిత్రహ్" అనగా ప్రవక్తలు దేనయితే ఇష్టపడతారో మీరు కూడా దాన్నే ఎంచుకున్నారు అని అన్నారు. ఆ తరువాత

హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని ఆకాశాల వైపుకు తీసుకు వెళ్ళారు. మొదటి ఆకాశానికి చేరుకోగా హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు అక్కడ నియమించబడిన దైవ దూతతో ద్వారం తెరవమని అన్నారు. ఆ దైవ దూత ముందు ఇలా ప్రశ్నించాడు: ఓ జిబ్రయీల్ ! మీతో పాటు ఇంకెవరు ఉన్నారు? నా తో పాటు 'ముహమ్మద్' ఉన్నారు అని జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు జవాబిచ్చారు. ఆ దూత మళ్ళీ ప్రశ్నించాడు: వారికి అల్లాహ్ తఆలా తరుపు నుండి ఆహ్వానము ఉందా? జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు "అవును వారిని అల్లాహ్ తఆలా ఆహ్వానించారు" అని జవాబిచ్చారు. ఇది వినగానే ఆ దూత 'మర్‌హబా' (స్వాగతం) అంటూ ఆకాశ ద్వారాన్ని తెరిచాడు.

(మొదటి ఆకాశం యొక్క ద్వారాన్ని బాబుల్ హఫజా అంటారు. ఈ ద్వరము వద్ద ఉన్న దైవ దూత పేరు ఇస్మాయీల్, అతడి ఆధీనములో 12000 మంది దైవ దూతలు ఉంటారు. ప్రతీ దూత క్రింద మరో 12000 మంది దూతలు ఉంటారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఖుర్‌ఆన్ లోని ఈ వచనాన్ని చదివారు: "నీ ప్రభువు సైన్యము ఎంత ఉందో ఒక్క నీ ప్రభువికి తప్ప ఇకెవ్వరికీ తెలీదు ఫత్‌హుల్ బారీ: 7/209; ఇబ్నె హిషామ్)

మొదటి ఆకాశం పై హజ్రత్ ఆదమ్ అలైహిస్సలామ్ గారు కలిసారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు మానవులందరి తండ్రి అయిన హజ్రత్ ఆదమ్ అలైహిస్సమ్ గారికి సలామ్ చేయగా వారు సలామ్ కు ప్రతిసలాము చేసి "మర్హబమ్ బిక మిన్ ఇబ్‌నిన్ వ నబియ్యిన్" (మా సంతానము మరియు ప్రవక్త అయిన మీకు స్వాగతం) అంటూ వారిని ఆహ్వానించారు. (వారి మధ్య ఇక ఏమి సంభాషణ జరిగిందో అది అల్లాహ్ కే తెలుసు. కొన్ని ఉల్లేఖనాల ద్వారా హజ్రత్ ఆదమ్ అలైహిస్సలామ్ గారి కుడి వైపున పుణ్యాత్ముల ఆత్మలు, ఎడమ వైపున పాపాత్ముల ఆత్మలు ఉన్నట్లుగా తెలుస్తుంది.) అక్కడి నుండు జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు దైవ ప్రవక్త

సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని రెండవ ఆకాశానికి తీసుకెళ్ళారు. ఆకాశ ద్వారం వద్ద మళ్ళీ అదే సంభాషణ జరిగింది. ద్వారాని తెరవమని హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు కోరగా అక్కడ నియమింపబడ్డ దైవ దూత మీతో పాటు ఎవరొచ్చారు? అల్లాహ్ తఆలా వారిని తీసుకురమ్మని చెప్పారా? అని ప్రశించాడు. దానికి నా తో 'ముహమ్మద్' ఉన్నారు, వారిని తీసుకురమ్మని అల్లాహ్ ఆదేశించారు" అని హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ వారు జవాబిచ్చారు. వెంటనే ఆ దూత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని స్వాగతిస్తూ ద్వారాన్ని తెరిచాడు. రెండవ ఆకాశంలో హజ్రత్ ఈసా మరియు హజ్రత్ యహ్యా అలైహిమస్సలామ్ కలిశారు. వారు మర్హబమ్ బిక మిన్ అఖిన్ వ నబియ్యిన్ (స్వాగతం ఓ సోదరా ! ఓ దైవ ప్రవక్తా !) అంటూ వారిని ఆహ్వానించారు. (వారి మధ్య జరిగిన సంభాషణ దేవుడే ఎరుగు) అక్కడి నుండి మూడవ ఆకాశానికి తీసుకెళ్ళారు. అక్కడి దూతతో కూడా అదే సంభాషణ జరిగింది. అల్లాహ్ తఆలా అజ్ఞ మేరకు హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ వారు దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని తీసుకొచ్చారని తెలుసుకోగా అక్కడి దూత కూడా మర్హబా (స్వాగతం) అంటూ ఆకాశ ద్వారాన్ని తెరిచాడు, మీ రాక శుభము అంటూ వారిని పలకరించాడు. మూడవ ఆకాశము పై హజ్రత్ యూసుఫ్ అలైహిస్సలామ్ గారిని కలవడం జరిగింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు సలామ్ చేయగా హజ్రత్ యూసుఫ్ అలైహిస్సలామ్ వారు జవాబుగా ప్రతి సలాము చేస్తూ మర్హబమ్ బిక మిన్ అఖిన్ వ నబియ్యిన్ (స్వాగతం ఓ సోదరా ! ఓ దైవ ప్రవక్తా) అంటూ వారికి స్వాగతం పలికారు. (అక్కడ జరిగిన సంభాషణ దేవునికే తెలుసు) అక్కడి నుండి నాల్గవ ఆకాశానికి చేరుకున్నారు. ప్రశ్నోత్తరాల తరువాత ద్వారం తెరవబడింది, దైవ దూత ప్రవక్త గారికి స్వాగతం పలికాడు. నల్గవ ఆకాశం పై హజ్రత్ ఇద్రీస్ అలైహిస్సలామ్ గారిని కలిసారు. వారి మధ్య కూడా సలామ్ ప్రతి సలామ్‌లు జరిగాయి, వారు కూడా ఇతర ప్రవక్తల లానే మీకు స్వాగతం ఓ సోదరా ! ఓ దైవ ప్రవక్తా అంటూ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని ఆహ్వానించారు. ఆ తరువాత ఐదవ ఆకాశాన్ని చేరుకున్నారు. అక్కడ హజ్రత్ జిబ్రయీల్ మరియు అక్కడి దైవ దూతకు మధ్య అదే సంభాషణ, ఆ పై గౌరవ ప్రధంగా ప్రవక్త వారిని ఆకాశం మీదకు స్వాగతించడం జరిగింది. అక్కడ హజ్రత్ హారూన్ అలైహిస్సలామ్ గారిని కలవడం జరిగింది. వారిని కూడా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు సలామ్ చేశారు. వారి సలామ్‌కు జవాబిచ్చి వారు కూడా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని ఆహ్వానించారు. అక్కడి నుండి ఆరవ ఆకాశానికి వెళ్ళారు. అక్కడి దైవ దూత హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ వారిని ప్రశ్నించిన తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి కొరకు ద్వారాన్ని తెరచి వారిని స్వాగతించాడు. ఆరవ ఆకాశంలో హజ్రత్ మూసా అలైహిస్సలామ్ గారిని కలిసారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారికి కూడా సలామ్ చేశారు. హజ్రత్ మూసా అలైహిస్సలామ్ గారు ప్రవక్త గారిని అవే పలుకులతో ఆహ్వానించారు. (వారి మధ్య ఏమి సంభాషణ జరిగిందో అల్లాహ్ కే తెలుసు, కాని) దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు అక్కడి నుండి ముందుకు సాగుతుండగా హజ్రత్ మూసా అలైహిస్సలామ్ గారు కన్నీరు పెట్టుకున్నారు. మీరు ఎందుకు ఏడుస్తున్నారు? అని హజ్రత్ మూసా అలైహిస్సలామ్ గారిని ప్రశ్నించగా వారు ఇలా సమాధానమిచ్చారు: "ఓ వ్యక్తి నా తరువాత (లోక కళ్యాణార్థం ప్రజల వద్దకు) పంపబడ్డాడు. అతని ఉమ్మత్ లోని స్వర్గస్తులు నా ఉమ్మత్ లోని స్వర్గస్తుల కంటే శ్రేస్థులు మరియు నా ఉమ్మత్ కంటే అధిక సంఖ్యలో ఉంటారు." ఆ తరువాత హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని తీసుకుని ఏడవ ఆకాశానికి వెళ్ళారు. ప్రశ్నోత్తరాల తరువాత ద్వారము తెరవబడింది. అక్కడ

హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్ గారిని కలుసుకున్నారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి సలామ్ కు ప్రతి సలామ్ చేసి మర్హబమ్ బిక మిన్ ఇబ్నిన్ వ నబియ్యిన్ (ఓ నా తనయుడా (సంతతికి చెందిన వాడా) ! ఓ దైవ ప్రవక్తా !) అంటూ హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్ వారు పలకరించారు.

ఆ తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారికి "బైతుల్ మామూర్" చూపించడం జరిగింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు "ఇది ఏమిటి?" అని హజ్రత్ జిబ్రయిల్ అలైహిస్సలామ్ వారిని ప్రశ్నించారు. దానికి జవాబుగా: "ఇది బైతుల్ మామూర్" ఇక్కడ దైవ దూతలు ప్రదక్షణలు చేసి నమాజు చేస్తారు. బైతుల్ మామూర్‌కు ప్రదక్షణ చేసి, అందులో నమాజు చేసే భాగ్యం ప్రతీ దైవ దూతకి జీవితంలో ఒక్క సారి మాత్రమే లభిస్తుంది. ఇక్కడ ఒక్క సారి ప్రదక్షణ చేసిన తరువాత మళ్ళీ వారి వంతు రానే రాదు" అని హజ్రత్ జిబ్రయిల్ అలైహిస్సలామ్ గారు అన్నారు. కొన్ని ఉ ల్లేఖనాల ఆధారంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్ వారిని కలిసినప్పుడు వారు బైతుల్ మామూర్‌కు ఆనుకొని కూర్చుని ఉన్నట్లుగా తెలుస్తుంది.

ఆ తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారికి "సిద్రతుల్ ముంతహా" చూపించారు. అదో పెద్ద వృక్షము. దాని ఆకులు ఏనుగు చెవుల వలే పెద్దవిగా ఉన్నాయని, దాని పండ్లు రాతి కుండంత పెద్దవిగా ఉన్నాయని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు తెలిపారు.

చూస్తుండగానే "సిద్రతుల్ ముంతహా"పై దేవుని సృష్టితాల్లో నుండి ఓ అపురూపమైన జాతి సృష్టితాలు వచ్చి వాలాయి. అవి వాలిన తరువాత సిద్రతుల్ ముంతహా సౌందర్యం ఎవరూ వర్ణించలేనంతగా పెరిగిపోయింది.

సిద్రతుల్ ముంతహా క్రింద దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు 4 సెలయేళ్ళను చూశారు. అందులో రెండు అగుపడేవి, రెండు అగుపడనివి. వాటి గురించి హజ్రత్ జిబ్రయిల్ అలైహిస్సమ్ వారిని ప్రశ్నించగా కనబడే సెలయేళ్ళు నైలు, ఫురాత్ అని, కనబడనివి స్వర్గపు సెలయేళ్ళు అని సమాధానమిచ్చారు.

ఆ తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు అల్లాహ్‌ను సమీపించారు. అల్లాహ్ తఆలాతో సంభాషించారు. కాని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఆ సమయంలో అల్లాహ్ ను చూశారా లేదా అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు మేరాజ్ రాత్రి అల్లాహ్ తఆలా యొక్క దర్శన భాగ్యాన్ని పొందారు. కాని హజ్రత్ ఆయిషా సిద్దీఖా రజియల్లాహు అన్హా గారు దీన్ని నిరాకరించారు. దివ్య ఖుర్ఆన్‌లో కంటితో అల్లాహ్‌ను చూడలేరని ఉంది కాబట్టి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు కూడా చూసుండరు అని వారు అభిప్రాయపడ్డారు. మరి కొన్ని ఉల్లేఖనాల్లో దేవుని తెజస్సును చూశారని ఉంది. ఎక్కువ శాతం విద్వాంసులు హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనాధారంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారికి దర్శన భాగ్యం కలిగిందని అభిప్రాయపడ్డా కొంత మంది విద్వాంసులు హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా గారి మాటల ఆధారంగా వారిని దర్శించలేదని అభిప్రాయపడ్డారు.

ఆధారాలు స్పష్టంగా లేనప్పుడు మనం ఏ విషయాన్ని తేల్చి చెప్పకూడదు. అందుకే ఈ విషయంలోనూ వాస్తవం జ్ఞానం అల్లాహ్ మరియు వారికి ప్రవక్తకు మాత్రమే ఉందని, మనకు దీని జ్ఞానము లేదని వదిలేయాలి. ఇందులో చర్చలు అనవసరం. ఇక స్పష్టమైన ఆధారాలతో మనకు తెలిసిన విషయం ఏమిటంటే ఆ సందర్భములో అల్లాహ్ తఆలా కొన్ని ఆదేశాలను, కొన్ని పవిత్ర

ఖుర్‌ఆన్ వచనాలను అవతరింపజేశారు. వాటిలో అతి ముఖ్యమైన ఆదేశం నమాజ్.

ఆరంభంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారికి రోజుకు 50 పూట్ల నమాజు చేయమని ఆదేశించబడింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు దైవాదేశాలను తీసుకుని తిరిగి ఆకాశాల నుండి క్రిందికి బయలుదేరారు. మధ్యలో హజ్రత్ మూసా అలైహిస్సలామ్ గారు ఎదురయ్యారు. "మీ ఉమ్మత్ పై అల్లాహ్ విధించిన విధులేమిటి?" అని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారిని ప్రశ్నించారు. వారు "నా ఉమ్మత్ ను రోజుకు 50 సార్లు నమాజు చేయమని ఆదేశించారు" అని సమాధానమిచ్చారు. దానికి హజ్రత్ మూసా అలైహిస్సలామ్ వారు ఇలా అన్నారు: "మీరు వెంటనే వెనక్కి వెళ్ళి, నా ఉమ్మత్ పై కనికరించి ఇందులో కాస్త రాయితీ ఇవ్వండి అని దరఖాస్తు చేయండి. ఎందుకంటే మీ ఉమ్మత్ పై ఇది పెద్ద భారమైపోతుంది. వారు ఈ ఆజ్ఞను సిరసావహించలేరు. నేను అనుభవంతో చెబుతున్నాను. బనీఇస్రాయీల్ సంతతని నేను చూశాను". హజ్రత్ మూసా అలైహిస్సలామ్ వారి మాటలు విన్న తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు వెనక్కి వెళ్ళి అల్లాహ్ తఆలా తో ఈ విధంగా దరఖ్వాస్తు చేశారు: "ఓ అల్లాహ్ ! నా ఉమ్మత్ పై కనికరించి వారిపై విధించిన నమాజుల సంఖ్యను తగ్గించండి. ఎందుకంటే నా ఉమ్మతీలు చాలా బలహీనులు. వారు ఈ ఆదేశాన్ని సిరసావహించలేరు." అల్లాహ్ తఆలా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి విన్నపాన్ని మన్నించి 5 నమాజులు తగ్గించి రోజుకు 45 సార్లు నమాజు చేయమని ఆదేశించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తిరిగి హజ్రత్ మూసా అలైహిస్సలామ్ వారి వద్దకు వచ్చి అల్లాహ్ నా ఉమ్మత్ పై కనికరించి 5 నమాజులను తగ్గించారని అన్నారు". హజ్రత్ మూసా అలైహిస్సలామ్ వారు "మీ ఉమ్మతీల్లో ఈ ఆదేశాన్ని పూర్తి చేసే శక్తి కూడా లేదు. మీరు వెళ్ళి మళ్ళి అల్లాహ్ ను వేడుకోండి. మరింత రాయితీ కల్పించమని కోరుకోండి" అని అన్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు మళ్ళీ వెళ్ళి మరో 5 నమాజులు తగ్గించుకుని వచ్చారు. కాని మూసా అలైహిస్సలామ్ వారు వారితో మళ్ళీ ఇవే మాటలు చెప్పి వెనక్కి పంపించారు. ఇలాగే పలు మార్లు జరిగింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు దరఖాస్తు చేసిన ప్రతీ సారి అల్లాహ్ తఆలా వారి దరఖాస్తును మన్నించి 5 – 5 నమాజులు తగిస్తూ వచ్చారు. చివరికి రోజుకు 5 పూట్ల నమాజు చేయమని ఆదేశిస్తూ అల్లాహ్ తఆలా ఇలా అన్నారు: ఓ ముహమ్మద్ ! ఇవి 5 నమాజులు, ఎవరైతే వీటిని ఆచరిస్తాడో నేను అతడికి 50 నమాజులు ఆచరించినంత పుణ్యాన్ని ప్రసాదిస్తాను. అలాగే నీ ఉమ్మత్ లో ఎవరైనా ఓ పుణ్యకార్యం చేయాలని మనసులో అనుకుంటాడో అతడు అనివార్య కారణాల వల్ల అది చేయలేకపోయినా నేను కేవలం అతడు సంకల్పించుకున్నందుకు అతడికి పుణ్యాన్ని ప్రసాదిస్తాను. ఒక వేళ అతడు సంకల్పించుకున్నట్లే ఆ పుణ్యకార్యాన్ని చేసి చూపిస్తే అతడికి పది రెట్లు ఎక్కువ పుణ్యాన్ని ప్రసాదిస్తాను. అదే విధంగా నీ ఉమ్మతీలు ఏదైనా పాపకార్యము చేయాలని మనసులో ధృడంగా అనుకుని దాన్ని చేయకపోతే వారి పాపపు సంకల్పమునకు బదులుగా వారి లెఖ్ఖా పత్రంలో పాపాన్ని వ్రాయను. ఒకవేళ వారు సంకల్పించుకున్న పాపము చేస్తే వారి లెఖ్ఖా పత్రంలో ఒక పాపము వ్రాస్తను."

తమ ఉమ్మత్ పై అల్లాహ్ చూపిన ఈ కనికరానికి కృతజ్ఞతలు చెల్లించుకుంటూ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తిరిగి మూసా అలైహిస్సలామ్ వారి వద్దకు వచ్చి జరిగినదంతా చెప్పారు. కాని మూసా అలైహిస్సలామ్ వారు మీ ఉమ్మత్ ఈ 5 పూట్ల నమాజు కూడా ఆచరించలేదు. మీరు వెళ్ళి ఇంకా తగ్గిచ్చమని అల్లాహ్ ను వేడుకోండి అని సలహా ఇచ్చారు. కాని తమపై, తమ ఉమ్మత్ పై అపారమైన

కనికరాన్ని చూపి పుణ్యాన్ని తగ్గించకుండా నమాజుల సంఖ్యను మాత్రమే తగ్గించిన అల్లాహ్ వద్దకు వెళ్ళి మేము ఈ 5 పూట్ల నమాజు కూడా చేయలేము అని అనడానికి సిగ్గువేసి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు మళ్ళీ వెళ్ళేందుకు నిరాకరించారు. కష్టమైనా సరే ఐదు పూట్ల నమాజు పాటించి తమ పై ఇంతటి దయా, కరుణలు చూపిన అల్లాహ్ కు తమ ఉమ్మత్ తప్పక కృతజ్ఞతలు చెల్లించుకుంటుందనే నమ్మకంతో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తిరిగి భూమి మీదకు వచ్చారు.

మస్జిదే అఖ్సాకు చేరుకున్నారు. అక్కడ ముందు నుంచే చాలా మంది ఉన్నారు. అప్పుడే నమాజు వేళ కూడా అయింది. వారిలో ఒకరు అజాన్ ఇచ్చారు. అందరూ సామూహిక నమాజు ఆచరించేందుకు పంక్తులలో నిలబడ్డారు. ముందుకెళ్ళి ఎవరు నమాజు చేయిస్తారు అని అందరూ ఎదురు చూస్తున్న తరణంలో హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ వారు దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి చేయి పట్టుకుని ముందుకు సాగనంపారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు నమాజు చేయించారు. తరువాత హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ వారు లేచి ఇలా అన్నారు: "ఓ దైవ ప్రవక్త ముహమ్మద్ ! మీ వెనుక నమాజు చేసిన వీరంతా ఎవరో మీకు తెలుసా?" దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తెలియదని సమాధానమివ్వగా, వీరంతా దైవ ప్రవక్తలు, అల్లాహ్ తఆలా ఎంత మందినైతే ప్రవక్తగా నియమించి పంపించారో వారంతా మీ నేతృత్వంలో నమాజు చేశారు అని హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు అన్నారు. (నోట్: కొంత మంది చరిత్రకారులు మస్జిదే అఖ్సాలో ప్రవక్తలందరితో కలసి నమాజు చేసిన ఈ సంఘటన ఆకాశాలలోకి వెళ్ళక ముందు సంభవించిందని అన్నారు. కాని ప్రామాణిక హదీసుల వెలుగులో చాలా మంది ధార్మిక విద్వాంసులు ఇది ఆకాశాల నుండి తిరిగొచ్చిన తరువాత జరిగిన సంఘటన అని దృవీకరించారు. అందుకే మేము కూడా దీన్ని చివర్లో వ్రాశాము). ఇక అక్కడే కట్టి ఉంచిన బురఖ్ పై ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు మక్కా కు తిరిగి వచ్చారు.

మరుసటి రోజు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు రాత్రి జరిగిన గగన ప్రయాణం గురించి విశ్వాసులకు తెలియజేశారు. విశ్వాసులైన ముస్లింలు ప్రవక్త వారి మాటలను విశ్వసించినా అవిశ్వాసులు ప్రవక్త వారి ఈ మాటలను తిసర్కరించడమే కాకుండా వారిని ఎగతాళి చేస్తారని, ఇదే అవకాశంగా భావించి వారిని అనరాని మాటలు అంటూ వారకి కీడును తలపెడతారని విశ్వాసులలో కొందరు అవిశ్వాసుల ముందు ఈ విషయాన్ని ప్రస్తావించవద్దని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని కోరారు. కాని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు దీన్ని ఖురైష్ ముందు తప్పక ప్రస్తావిస్తానని అన్నారు. ఊహించినట్లే అవిశ్వాసులు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి మాటలు విని వాటిని తిరస్కరించారు. వంద నోళ్ళు వంద మాటలు అనట్లు ఒక్కొక్కడు ఒక్కో విధంగా ఎగతాళి చేయడం ఆరంభించారు.

